# ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- యడ్లపాడులో గడప గడపకు మన ప్రభుత్వం


యడ్లపాడు ముస్లింవాడలో సంక్షేమంపై అవగాహన కల్పిస్తున్న మంత్రి విడదల రజిని

**యడ్లపాడు:** సంక్షేమ పథకాలను చెంతకే చేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. మండల కేంద్రమైన యడ్లపాడులో గడప గడపకు మన ప్రభుత్వం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను పలకరిస్తూ నాలుగేళ్ల కాలంలో ఆయా కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. నవరత్నం సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా... సచివాలయాల నుంచి పౌరసేవల్ని పొందుతున్నారా... సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సేవలు ఎలా ఉన్నాయంటూ మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా కొత్తూరూ ప్రజలు తమ వ్యక్తిగత సమస్యల్ని మంత్రి రజిని దృష్టికి తెచ్చారు. గుండె ఆపరేషన్‌కు సిఫార్సు చేయాలని, షాదీతోఫా, వైఎస్సార్ పెన్షన్ కానుక ఇప్పించాలని, సినిమా హాలు బజారులో సైడ్ డ్రైన్లు కావాలంటూ విజ్ఞప్తి చేశారు. సంబంధిత శాఖల అధికారులను పిలిపించి ఆయా సమస్యలకు పరిష్కారం చూపాలని మంత్రి ఆదేశించారు.

**సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం...**

రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జగనన్న సురక్ష శిబిరాల ద్వారా సుదీర్ఘకాలంగా నిలిచిన నెలల తరబడి కాని పనులు సత్వరమే అందించడం జరిగిందన్నారు. వేలాది మందికి ఉచితంగా 11 రకాలకు చెందిన వివిధ ధ్రువపత్రాలను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి పథకం అర్హులైన వారికి ఎలాంటి సిఫార్సు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి సాయం జమ చేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి రజిని కొనియాడారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్‌చైర్మన్ ఎం వీరారెడ్డి, ఎంపీపీ పిడతల ఝాన్సీ, సర్పంచి కె.హేమ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, పీఏసీఎస్ చైర్మన్ బసెల శివరామకృష్ణ, నాయకులు మాదం శ్రీనివాసరావు, బచ్చా, షాజహాన్, బండ్ల రామ్‌కుమార్, కల్లూరి హరిబాబు, కర్నాట సుబ్బారావు, బొంత ప్రభుదాసు, యామర్తి కోటేశ్వరరావు, పి దయాసాగర్, వడ్డేపల్లి నరసింహరావు, రావూరి వేణుగోపాలరావు, ఎంవీ సుబ్బారావు, తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీఓ వై.హనుమారెడి, ఈఓపీఆర్డీ వరూధిని పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రమణయ్య పేటకు చెందిన కామినేని సీతారాములు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల్ని మంత్రి పరామర్శించారు.

# రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


వార్డులో అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట:** నాలుగేళ్లలో పురపాలక పరిధిలో సుమారు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం 31వ వార్డు పెద్దచెరువు మహాలక్ష్మినగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు రూ.20 లక్షల నిధులతో చేపట్టిన ఏడు అభివృద్ధి పనులకు టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం 34 వార్డుల్లో 32 వార్డులకు వార్డుకు రూ.20 లక్షల చొప్పున విడుదలైన రూ.6.40కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తున్నామని వివరించారు. ఈ వార్డులో రూ.20లక్షలతో మూడు సిమెంట్ రోడ్లు, ఒక డ్రెయిన్, తాగునీటిపైపులైను, ఒక బోరు, విద్యుత్ స్తంభాలు వాటికి విద్యుత్ లైట్ల ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. పనులన్నీ రెండునెలల్లో పూర్తి చేస్తామన్నారు. వార్డులోని దర్గా నుంచి వల్లప్పచెరువు బైపాస్‌రోడ్డు వరకు రూ.40లక్షలతో బీటీ రోడ్డు వేయించామన్నారు. దీని వలన వాహనాలు అన్నీ బైపాస్‌రోడ్డుకు సులభంగా చేరేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. వల్లప్పచెరువు, అగ్రహారం, గుంటగార్లపాడులలో పొలాలకు వెళ్లేందుకు రోడ్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తాగునీటి సమస్యను తీర్చామన్నారు. పురపాలక పరిధిలో తాగునీటికి సమస్యలేకుండా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు, శాంతినగర్ ట్యాంకులను సాగర్ జలాలతో నింపామన్నారు. దీని వలన వచ్చే మూడునాలుగు నెలలకు తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు నీరు వచ్చే అవకాశం ఉన్నందున ఈ ఏడాదికి తాగునీటికి ఎటువంటి ఇబ్బంది ఏర్పడబోదన్నారు. కత్తవ చెర్వులో రూ.5.5కోట్లతో అభివృద్ధి చేసి మధ్యలో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్‌కు వెళ్లబోతున్నట్లు చెప్పారు. ఆటోనగర్ కోసం 30 ఎకరాల స్థలసేకరణ చేశామన్నారు. బరంపేటలో షాదీఖానా, బీసీ భవన్, అంబేడ్కర్ భవన్ నిర్మాణాలన్నీ పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, ఎంఈ డి.శ్రీనివాసరావు, డీఈ ఓ.శ్రీనివాసరావు, ఏఈ నాయక్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, గిరిజన, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి కాకుమాను సదాశివరెడ్డి, ఎస్సీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మల్లెల అశోక్, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి, సచివాలయ కన్వీనర్ షేక్ జాని, షేక్ కరిముల్లా, ఎం.నాగిరెడ్డి, జి.శివారెడ్డి, డి.శివారెడ్డి, గోగుల పాపారావు, చిన్ని శ్రీనివాసరావు, బొగ్గరం మూర్తి పాల్గొన్నారు.

# క్లుప్తంగా

## గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ



**వినుకొండ టౌన్:** గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. పట్టణంలోని విష్ణుకుండి నగర్లోని అంగన్‌వాడీ కేంద్రం రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వినుకొండ సీడీపీఓ అనూరాధ, న్యాయవాది యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సభ్యులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందజేత



**వినుకొండ(నూజెండ్ల):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన దివ్యాంగురాలు భవనాసి నక్షత్రంకు ట్రైసైకిల్‌ను మంగళవారం అందజేశారు. పది మంది గర్భిణులకు అవసరమైన హైజెనిక్ కిట్స్‌ను అందించారు. ఒక ట్రైసైకిల్ అందుబాటులో ఉందని, అవసరమైన వారు 9291506317 నంబరును సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బెల్లంకొండ ప్రసాద్, పాత్తూరి రాము, గర్రె అనిల్, గజవల్లి పవన్, చిలంకూరి కోటేశ్వరరావు, చిన్ని, ఐరామ్మూర్తి, గుంటకల వీర అంకమరావు, పేరూరి కృష్ణ, కజ్జాయం విజయలక్ష్మి, జవ్వాజి సువర్ణలక్ష్మి, శారద, మేఘమాల, లక్ష్మీరాజ్యం, ఉష, ఠాగూర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి టేక్ హోమ్ రేషన్ విధానం ప్రారంభం

**శావల్యాపురం:** అంగన్‌వాడీ సెంటర్లలో టేక్ హోమ్ రేషన్ విధానం (ఇంటి తీసుకొని వెళ్లే విధానం) బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలలితా మంగళవారం తెలిపారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

**ఈపూరు:** కౌలు రైతు కార్డుల కోసం ఈ నెల 7వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి రామారావు కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు భూమి లేకపోయినా కౌలు రైతు కార్డులు పొందవచ్చని, అయితే వారికి భూమి ఇచ్చే యజమానికి 2.50 ఎకరాలు ఉండాలని తెలిపారు. 2060 కౌలు రైతు కార్డులు టార్గెట్ ఉండగా ఇప్పటికి 1298మంది కౌలు రైతులు కార్డులు పొందారని మరో 762 కౌలు రైతు కార్డులు పొందేందుకు అవకాశం ఉందని ఆయనపేర్కొన్నారు.


## నర్సరీలకు అనుమతి తప్పనిసరి

**నాదెండ్ల:** నర్సరీ యజమానులు అనుమతులు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఎస్.కిషోర్ కుమార్ కోరారు. చిరుమామిళ్ల గ్రామంలో వ్యవసాయ షేడ్‌నెట్ నర్సరీలను స్థానిక వ్యవసాయశాఖ అధికారి ఎ.హరిప్రసాద్‌తో కలసి తనిఖీ చేశారు. నర్సరీ యజమానుల అనుమతులు పరిశీలించి రికార్డులు సక్రమంగా ఉన్నాయో లేదోనని తనిఖీ చేశారు. రైతులకు అందించే మిర్చి నారు నాణ్యమైనదిగా ఉండాలని, అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను ఎంచుకోవాలన్నారు. చీడపీడలను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. నర్సరీ యజమానుల దగ్గర నారు తీసుకున్నపుడు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసి నర్సరీ యజమానులకు ఇచ్చినపుడు రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. వారితో పాటూ గ్రామ ఉద్యానవన సహాయకులు సుబ్బారావు ఉన్నారు.

## వృద్ధుడిపై దాడి

**నరసరావుపేట టౌన్:** వృద్ధుడిపై నలుగురు యువకులు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాష్‌నగర్‌కు చెందిన పసుపులేటి సత్యనారాయణ 60 అడుగుల రోడ్డు దాటుతుండగా ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ప్రభాకర్ ఢీకొట్టాడు. నిర్లక్ష్యంగా వాహనం నడపడంపై సత్యనారాయణ ప్రశ్నించడంతో ప్రభాకర్, అతని ముగ్గురు స్నేహితులతో కలసి దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

## ఈపూరు యార్డు డైరెక్టర్ నాగేశ్వరరావు మృతి



**శావల్యాపురం:** ఈపూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరు తిరివిధి నాగేశ్వరరావు(70) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈయనది మండలంలోని పిచికలపాలెం గ్రామం. భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచి తిరివిధి శివకుమారి, మాజీ సర్పంచి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరివిధి రమణారావు, దండు చెన్నయ్య ఉన్నారు.

## మానసిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి


భవిత పాఠశాలలో మాట్లాడుతున్న డాక్టర్ కె.శ్రీనివాస్

**నరసరావుపేట ఈస్ట్:** చిన్నారులు, పెద్దలలో పెరుగుతున్న మానసిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. పాతూరులోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రం భవిత పాఠశాలను మంగళవారం సందర్శించారు. మానసిక దివ్యాంగులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. నేడు సామాజిక పరిస్థితులలో చిన్నారులతో పాటు పెద్దలలో కూడా మానసిక సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా ఆయా సమస్యలపై అవగాహనతో వాటిని అధిగమించాలని, లేని పక్షంలో మానసిక రుగ్మత పెరుగుతుందన్నారు. ఆందోళన కలిగిన సమయంలో సకాలంలో వైద్యులను సంప్రదించి మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని సూచించారు. మానసిక సమస్యల నిర్మూలనకు తమ సంస్థ పనిచేస్తున్నదని వివరించారు. మానసిక దివ్యాంగులతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినిలు జి.మేరికుమారి, ఎస్.పద్మజా పాల్గొన్నారు.

## ఠంఛన్‌గా పింఛన్లు



**నాదెండ్ల:** మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ మంగళవారం తొలిరోజు 69 శాతం పూర్తి చేశారు. మొత్తం 16 సచివాలయాల పరిధిలో 9193 మందికి గాను రూ.2,53,46,250 పంపిణీ చేయాల్సి ఉంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

# న్యాయవాదుల నిరసన


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వినుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు

**వినుకొండ టౌన్:** విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది ఆర్.ఆదిశేషు విఠల్ బాబు హత్య నిందితులను శిక్షించాలని వినుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. హత్యకు నిరసనగా మంగళవారం న్యాయవాదులు తమ విధులకు గైర్హాజరై, నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టాలను మరింత బలోపేతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీరాంజనేయ చౌదరి కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సీతారామాంజనేయులు, సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి నాగేశ్వరరావు, గంధం హరిప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పీజే లూక, సిహెచ్.వెంకిరెడ్డి, టి.హనుమంతరావు, ఎలీషాబాబు, బి.శ్రీనివాసులు, జెట్టి తిరుపతిరావు, మీసాల శ్రీనివాసరావు, రమణారావు, అప్పారావు, తలారి ఆంజనేయులు, అశోక్ బాబు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## హద్దు రాళ్లు తొలగిస్తే కఠిన చర్యలు

**రొంపిచర్ల:** పంట పొలాల్లో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద సర్వే నిర్వహించి నాటిన హద్దు రాళ్లను కొందరు తొలగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అంకారావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 14 రెవెన్యూ గ్రామాలకు గాను ఏడు గ్రామాల్లో సర్వే పూర్తి అయిందని చెప్పారు. ఈ గ్రామాల్లో హద్దు రాళ్లు నాటేందుకు 25 వేల హద్దు రాళ్లు వచ్చాయన్నారు. సర్వే నిర్వహించి పాతిన రాళ్లను కొందరు కావాలని తొలగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ రాళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా భూ యజమానులపై ఉందని చెప్పారు. తొలగింపు చర్యలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. హద్దురాళ్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మణిపూర్ ఘటనలపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ


నిరసన తెలియజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

**రొంపిచర్ల:** మణిపూర్ ఘటనలపై మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చెరువుకట్ట సెంటర్‌లో మానవహారం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ జి.అంకారావుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలుగా దళితులపై, బలహీన వర్గాల ప్రజలపై దాడులు జరిపి వారి ఇళ్లను ధ్వంసం చేయడం దారుణమన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగిక దాడి చేసి హత్య చేయడం దుర దృష్టకరమన్నారు. ఈ ఘటనలకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలన్నారు. పార్లమెంట్‌లో ఘటనలపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, సీపీఎం నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు, శివకుమారి, కామినేని రామారావు, వై.రాధాకృష్ణ, బీఎస్పీ జిల్లా నాయకుడు బూదాల బాబూరావు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



**చిలకలూరిపేట:** సీజనల్ వ్యాధులపై సమాజంలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ చెప్పారు. పట్టణంలోని రజకకాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశ డేను పురస్కరించుకొని ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఇళ్ల పరిసరాలలో నీటి నిల్వ వలన దోమల వ్యాప్తి జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిశుభ్రత పాటించని పక్షంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని చెప్పారు. వ్యాధుల బారిన పడి చికిత్స పొందే కన్నా వ్యాధి బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు.

## ముగిసిన కొండవీడు రెవెన్యూ రీసర్వే ప్రక్రియ


చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామసభలో

**యడ్లపాడు:** వైఎస్సార్ జగనన్న భూహక్కు-భూరక్ష కార్యకమంలో భాగంగా మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో రీ సర్వేకు సంబంధించిన రైతులకు 9(2) నోటీసులు పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొండవీడు రెవెన్యూ పరిధిలో సుమారు 950 సర్వే నంబర్లలో మూడు నెలల పాటు రీసర్వే ప్రక్రియ కొనసాగిందన్నారు. ఆయా సర్వే నంబర్లలో కొలతలు నిర్వహించి రెవెన్యూ పరిధిలోని రైతులకు 9(2) నోటీసులను అందజేశామని, ఈ నోటీసుల్లో రైతుకు ఏ సర్వే నంబర్‌లో ఎంత విస్తీర్ణం కలిగిన భూమి ఉందో ఆ భూములకు కొత్తగా ఇచ్చిన ల్యాండ్ పార్సిల్ నంబర్‌లను తెలియజేయడం జరిగిందన్నారు. సదరు నోటీసులను చదువుకుని వాటిలో హద్దులు, విస్తీర్ణం ఇతరేత్ర అభ్యంతరాలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లేదా మొబైల్ మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకుని సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు. ఇదే వేదికపై అందజేసినట్లు వెల్లడించారు. సభలో పీఏసీఎస్ చైర్మన్ బసెల శివరామకృష్ణ, ఆర్ఐ చక్రవర్తి పాల్గొన్నారు.

## 9న సేవ్ ఇండియా

**చిలకలూరిపేట:** కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న సేవ్ ఇండియా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ పల్నాడు జిల్లా కన్వీనర్ కాసా రాంబాబు చెప్పారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విరమించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ కార్మిక వర్గం సమర శంఖారావం పూరించినట్లు చెప్పారు. కేంద్ర విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా స్ఫూర్తితో సేవ్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు పి.రామారావు, డి. వరహాలు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి నిర్మల పాల్గొన్నారు.

## దంత సంరక్షణతో ఆరోగ్య రక్ష

**చిలకలూరిపేట:** దంత సంరక్షణతో ఆరోగ్య సంరక్షణ సాధ్యమవుతుందని డాక్టర్ పేర్ని కృష్ణమోహన్ తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో డెంటల్ హైజిన్ ఎవేర్‌నెస్‌డేను పురస్కరించుకొని ఎంసీఆర్ మున్సిపల్ స్కూల్‌లో దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ దంత సంరక్షణ కోసం రోజుకు రెండుసార్లు దంతధావనం చేయాలని చెప్పారు. ఆకుకూరలు, కూరగాయలతో పాటు రోజు కు కనీసం రెండు లీటర్ల నీరు తాగాలని సూచించారు. శాస్త్రీయంగా దంతలు శుభ్రం చేసే విధానాన్ని విద్యా ర్థులకు ప్రదర్శించి చూపారు. క్లబ్ అధ్యక్షుడు కావు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, తోటకూర వెంకటనారాయణ, దండా లక్ష్మీనారాయణ, తియ్యగూర యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## జెడ్పీ పాఠశాల తనిఖీ


అసైన్‌మెంట్‌లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్

**రొంపిచర్ల:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి కె.వేణుగోపాల్ తనిఖీ చేశారు. పాఠశాలలో 9,10వ తరగతి గదులను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా బోధించే తీరు పరిశీలించారు. పాఠశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక పంపిణీపై ఆరా తీశారు. పాఠ్యప్రణాళిక, డైరీలను పరిశీలించారు. ఫార్మేటివ్ అసైన్‌మెంట్ వన్ పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. అదే విధంగా పదో తరగతి విద్యార్థుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఎం. సుభానీ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## ఏపీ ఎన్‌జీఓ మహాసభలకు ఉద్యోగులు తరలి రావాలి


మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

**నరసరావుపేట:** ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర మహాసభలకు జిల్లాలోని ఉద్యోగులు భారీగా తరలిరావాలని తాలూకా అధ్యక్షుడు మర్లపాటి రామకష్ణ కోరారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. రామకష్ణ మాట్లాడుతూ విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21, 22తేదీల్లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ బైలాకు సంబంధించి కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉందని చెప్పారు. తాలూకా కార్యదర్శి మాదాసు ఆనంద్ మాట్లాడుతూ సభల జయప్రదానికి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళా అధ్యక్షులు అనూరాధ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగుల కోసం వసతి ఏర్పాట్లు కూడా చేశామన్నారు. కార్యక్రమంలో తాలూకా కోశాధికారి చింతకుంట కోటిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు డీవీడీ ప్రసాద్, నారాయణ, కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి శ్యామల, మాణిక్యమ్మ, సీనియర్ సభ్యులు సాంబశివరావు పాల్గొన్నారు.

# తల్లి పాలు అమృతంతో సమానం


నాదెండ్లలో.. ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది


బొల్లాపల్లి.. అవగాహన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు


కొండవీడులో తల్లిపాల వారోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**నాదెండ్ల:** తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని, పుట్టిన గంటకే తల్లి పాలు తాగించాలని వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సాయిశ్వేత చెప్పారు. నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, ఆశ డే నిర్వహించారు. తొలుత సిబ్బందితో కలసి ఆస్పత్రి నుంచి గ్రామంలోని మెయిన్‌రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు పద్మావతి, రూతమ్మ, ఎంపీహెచ్‌ఈవోలు విజయరాజు, భూపతిరావు, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

**పుట్టిన బిడ్డకు ముర్రిపాలు శ్రేష్టం**

**నరసరావుపేట రూరల్:** బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు అందించాలని ఐసీడీఎస్ ములకలూరు సెక్టార్ సూపర్‌వైజర్ టి.వెంకటేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని కేఎం అగ్రహారంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి దరువూరి బాబు, అంగన్‌వాడీ వర్కర్ విప్పర్ల సత్యవతి, గాడిపర్తి కోమలి పాల్గొన్నారు.

**యడ్లపాడులో..**

**యడ్లపాడు:** తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని ఎంపీయూపీ ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కొండవీడులో మంగళవారం తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో యడ్లపాడు సొలస సెక్టార్ పరిధిలో నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎం.జోజమ్మ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నాగమల్లేశ్వరీ, షేక్ కరీమూన్, ఎస్.సువర్చల, ఎస్.నళిని, ఎం.సంధ్యాదేవి, జి.యశోదదేవి పాల్గొన్నారు.

**బొల్లాపల్లిలో..**

**బొల్లాపల్లి:** మండలంలోని మేళ్లవాగు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పుట్టిన అరగంటలోగా బిడ్డకు తల్లిపాలు తాగించాలని, ముర్రుపాలు ఆరోగ్యకరమని, పోషక విలువలు అధికంగా ఉండి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

## చెరువులను సాగర్ జలాలతో నింపాలి

**శావల్యాపురం:** చెరువులను సాగర్ జలాలతో నింపాలని ఎంపీడీఓ పి.సీతారామయ్య కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడారు. సాగర్ జలాలను తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మరో రెండు రోజుల పాటు సరఫరా ఉంటుందని చెప్పారు. మండలంలోని తాగునీటి చెరువులు, వాగులు, కుంటలు నింపాలన్నారు. శావల్యాపురంలోని చెరువును పంచాయతీ నిధులతో రూ.లక్షతో రెండు విద్యుత్ మోటార్లుతో పాటు బావి దగ్గర పైపులు కూడా మరమ్మతులు చేయిస్తామన్నారు. ఆయనతో పాటు ఈఓపీఆర్డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర ఉన్నారు.